క్లుప్తంగా

బీటీ రోడ్డు ఏర్పాటుపై హర్షం



గుర్లకుంటతండాలో సాగుతున్న బీటీ రోడ్డు పనులు

కడ్తాల్: ఎన్నో ఏళ్లుగా బీటీ రోడ్డు కోసం ఎదురు చూస్తున్న తండావాసులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2022 ఏడాది చివర్లో కడ్తాల్ నుంచి గుర్లకుంటతండా వరకు కిలోమీటరు మేరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం సీఆర్ఆర్ నిధులు రూ.కోటి నిధులు మంజూరు చేసింది. సాంకేతిక కారణాలతో పనులు ప్రారంభించి నత్తనడకన సాగుతూ వచ్చాయి. దీంతో తండావాసులు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేశారు. దీంతో గుర్లకుంట తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన నాయిని బుచ్చయ్యకు రూ.44 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. అదే విధంగా నియోజకవర్గంలో వివిధ మండలాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సైతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, న్యాయవాది గణేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్, గణేశ్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

భూముల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్



ఇబ్రహీంపట్నం రూరల్: భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా గంటీల వెంకటేశ్‌ను నియమించారు. మండలంలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామం మన్నెగూడకు చెందిన వెంకటేష్‌ను నియమించినట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొడుకొండ్ల ప్రవీణ్ మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన వారికి కృతజ్ఞతలు చెప్పారు.

విద్యార్థినులకు సీపీఆర్‌పై అవగాహన



మాక్ సీపీఆర్‌ను వివరిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

యాచారం: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు మంగళవారం యాచారం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ప్రియాంక సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ నెల 17 వరకు సీపీఆర్‌పై జరిగే కార్యక్రమంలో భాగంగా బీసీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి విద్యార్థి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గుండె ఆగిపోవడం జరిగినప్పుడు సీపీఆర్ చేయడంతో మనిషి బతికే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సతీశ్

మొయినాబాద్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సతీశ్ అన్నారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి ఎంపీడీఓ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్రమత్తతే మేలు

- పశువులకు ప్రాణాంతకంగా గాలికుంటు వ్యాధి
- పాల దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ముందస్తు చర్యలతో నివారణ
- నేటి నుంచి వ్యాధి నివారణ టీకా పంపిణీ కార్యక్రమం



పాడి పశువులు

కడ్తాల్: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి పశువులకు గాలికుంటు టీకా కార్యక్రమం ప్రారంభం కానుంది. మండలంలో టీకా పంపిణీ చేయడానికి వైద్య సిబ్బందిని ఐదు బృందాలుగా ఏర్పాటు చేశారు. నవంబర్ 14వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామాల్లో పశువులు, మేకలు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ సూచిస్తున్నారు. అలాగే గాలికుంటు వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకితే పశువుల్లో కలిగే మార్పులు, వ్యాధి బారిన పడిన పశువులకు అందించే చికిత్స విధానాలపై ఆయన వివరించారు.

వ్యాధి లక్షణాలు

- గాలికుంటు వ్యాధి సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104–106 డిగ్రీల వరకు ఉంటుంది.
- నోరు, పళ్ల చిగుళ్లు, నాలుక, చనుమొనలపై పొక్కులు, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి, అవి 24 గంటల వ్యవధిలో చితికి పోవడంతో పశువులు నొప్పితో మేత మేయడం మానేస్తాయి.
- నోటి నుంచి చొంగ, సొల్లు కార్చుతాయి.
- కాళ్ల గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి, అవి కొద్ది సమయంలో చితికిపోయి కాళ్ల నొప్పితో సరిగ్గా నడవలేవు.
- పాడి పశువుల పొదుగుపై బొబ్బలు ఏర్పడి వాపు కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో బొబ్బలకు బ్యాక్టీరియా ఆశించడంతో చీముతో చికాకుకు గురి చేస్తాయి.
- గాలికుంటు వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన దూడలు మరణించే అవకాశాలు ఎక్కువ. దూడలకు పాలను వేడి చేసి తాగించడం మేలు.
- చూడితో ఉన్న పశువుల్లో గర్భ స్రావాలు సంభవిస్తాయి.
- సేద్యం పనులు చేసే పశువులు, వ్యాధి సోకితే పనులు చేయలేవు.
- పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతాయి.
- వ్యాధి సోకిన పశువులు రక్తహీనతతో శ్వాసను కష్టంగా పీలుస్తాయి. బుస కొడుతూ ఎండ వేడిమికి తట్టుకోలేక నీరసించిపోతాయి.

తక్షణం అందించే చికిత్స

- పశువుల్లో ఏర్పడిన పుండ్లను గమనించి, పర్మాంగనేట్ నీటితో వాటని శుభ్రం చేయాలి.
- నోటి పుండ్లకు బోరో గ్లిజరిన్, కాళ్ల పుండ్లకు జింక్ ఆక్సైడ్, లోరాక్సిన్ హిమాక్స్ అలాంటి ఆయింట్‌మెంట్స్ రాయాలి. ఈగలు, దోమలు వాల్లకుండా వేప నూనె, నిమ్మెంట్ లాంటి మందులు వాడాలి.
- ఒకవేళ వైరస్ మెడిసిన్ పనిచేయనప్పుడు, తర్వాత కలిగే అనార్థాల నివారణకు యాంటీబయటిక్స్ 3 నుంచి 5 రోజుల వాడాలి.

వ్యాధి నివారణ ఇలా

- పశువులకు గాలికుంటు నిరోధక టీకాలను మొదటిసారి మూడు నెలల వయసులో బూస్టర్ డోసు తర్వాత నెల రోజుల తర్వాత అందించాలి.
- తదుపరి సంవత్సరం క్రమం తప్పకుండా టీకా వేయించాలి. టీకాలు వేయించడంతో రెండు మూడు వారాల అనంతరం పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో ఆరునెలల వరకు వ్యాధి సోకే ప్రమాదం ఉండదు. నిండు చూడిగా ఉన్న పశువులకు ఈనిన తర్వాత టీకాలు వేయించడం మంచిది.
- గాలికుంటు టీకాలు వేయించిన తదుపరి పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరునెలల వరకు ఆరోగ్యంగా ఉంటాయి.

మాడ్గులలో..

మాడ్గుల: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా బుధవారం నుంచి నవంబర్ 14వ తేదీ వరకు టీకాలు వేస్తామని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శంకర్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాలికుంటు వ్యాధి టీకాలు ఉచితంగా ఇస్తామని చెప్పారు. పశుపోషకులకు సమాచారం ఇచ్చి గ్రామాలకు వెళ్లి పశువులకు టీకాలు వేస్తామన్నారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గ్రామాలతో పాటు, పెద్దఅంబర్‌పేట, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధుల్లోని గ్రామాల్లో బుధవారం నుంచి పశువులకు గాలికుంటు టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి సీహెచ్.నరసింహారావు తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పశువులకు టీకాలు వేయించాలని ఆయన కోరారు.

జాపాలలో..

మంచాల: మండలంలోని జాపాల గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆరుట్ల పశు వైద్యాధికారి వనజ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు గ్రామంలోని పోచమ్మ దేవాలయం వద్ద పశు వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఇందులో పశువులకు గాలి కుంటు టీకాలు వేస్తారని చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వార్డులో సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీశైలంయాదవ్ తదితరులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్ బైకని శ్రీశైలం యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ శంకర్‌నాయక్‌ను కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందించారు. 11వ వార్డు పరిధిలో వీధిలైట్లు బిగించాలని, సీసీ రోడ్డు, అంతర్గత మురుగు కాలువలు నిర్మించాలని వినతిపత్రంలో కోరారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నందున అతనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు అశోక్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, నర్సింహ, జగదీశాచారి, యాదయ్య, వెంకటయ్యయాదవ్, పర్వతాలు, శేఖర్, వినయ్, బంటి, రాజు, కృష్ణయ్య, వెంకటేశ్, శ్రీను, ఆరీఫ్, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

ఆమనగల్లు: ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతకాల సేకరణలో భాగంగా పట్టణంలో మంగళవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఓటుచోరీకి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో 3వేల మందితో సంతకాల సేకరణ చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, నాయకులు మండ్లి రాములు, మానయ్య, మల్లేశ్‌నాయక్, మల్లయ్య, రామకృష్ణ, గోపి, సురేశ్, లక్ష్మణ్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



కడ్తాల్: ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణలో యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: దేశంలో బీజేపీ ప్రతి చోట ఓట్ల చోరీకి పాల్పడిందని యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 100 మంది సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ.. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతి గ్రామంలో సంతకాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. దేశంలో పెద్ద ఎత్తున ఓటు చోరీకి పాల్పడి బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.సురేశ్, వై.సురేశ్, రమేశ్, క్రాంతి, కరీం, సమీర్, అశ్విన్, మంజుల, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. మార్కెట్‌యార్డు కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ సమావేశం జరిగింది. మార్కెట్ యార్డులోని ఓపెన్ ప్లాట్‌లో షెడ్డు నిర్మించాలని, గోదాం మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట సీసీ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అనంతరం యాట గీత మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. త్వరలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు రమేశ్, నరేశ్‌నాయక్, రవీందర్, జంగయ్య, యాదయ్య, సంపత్‌కుమార్, శ్యాంసుందర్ రెడ్డి, అజీం, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, అంజయ్య, పాండురంగయ్య, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో భవ్యతేజినికి బంగారు పతకం



అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కొందుర్గు: వరంగల్‌లో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొందుర్గు విద్యార్థిని భవ్యతేజిని సత్తా చాటింది. అండర్–17 విభాగంలో ఆమె బంగారు పతకం సాధించింది. ఈ మేరకు వరంగల్ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆమె అవార్డు అందుకున్నారు.

మైసిగండిలో ప్రత్యేక పూజలు



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రవియాదవ్

ఆమనగల్లు: కడ్తాల మండలం మైసిగండిలోని మైసమ్మ ఆలయంలో మంగళవారం రాష్ట్ర సదర్ ఉత్సవ కమిటీ కార్యదర్శి చీపిరి రవియాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అశోక్ యాదవ్, ఉపాధ్యక్షుడు రేణుకేశ్‌యాదవ్, షాద్‌నగర్ యూత్ ప్రెసిడెంట్ రవియాదవ్, రెడ్డి సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యాసంగి పంటలపై అవగాహన అవసరం

మొయినాబాద్: వాతావరణ మార్పుల ప్రభావం నుంచి పంటలను సంరక్షించుకోవాలని వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు లీలారాణి, మహాదేవప్ప అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ వాతావరణ విభాగం, భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సంయుక్త ఆధ్వర్యంలో యాసంగి, రబీ పంటలపై వాతావరణ ప్రభావం, పాటించాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు నిలవకుండా ఎత్తు మందులు(బోజలు) వేసుకోవాలన్నారు. పూలు, కూరగాయ పంటలు సాగు చేసే రైతులు నర్సరీల్లో నారు పోసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్‌లో మౌసమ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని స్థానిక వాతావరణ పరిస్థితులను తెలుసుకోవచ్చన్నారు. ఆ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనులు, పంటలుసాగు చేసుకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో వాతావరణ శాఖ అధికారి నాగరత్న, చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు, మొయినాబాద్ ఏఓ అనురాధ, ఏఈఓలు సునీల్‌కుమార్, కుమార్, వరుణ్, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి



దీక్షలో కూర్చున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఆమనగల్లు: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి కురుమయ్య ఆధ్వర్యంలో రీజనల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసిత రైతులతో కలిసి ఒకరోజు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఆర్ నిర్మాణం పేరుతో నిరుపేద రైతుల భూములను లాక్కోవడం అన్యాయమన్నారు. ట్రిపుల్‌ఆర్ మొదటి అలైన్‌మెంట్‌ను మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తరువాత బడాబాబుల భూములను కాపాడుతూ నిరుపేద రైతుల భూములను కోల్పోయేలా అలైన్‌మెంట్‌ను మార్చారని ఆరోపించారు. ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా మొదట ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, వెంకటయ్య, చెన్నయ్య, దైవానందం, పోచయ్య, మల్లేశ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, నిర్వాసిత రైతులు మల్లేశ్, యాదగిరి, నవీన్, మాధవరెడ్డి, యాదయ్య, రాజు, ధర్మారెడ్డి, సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ రిలే దీక్షకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంఘీభావం తెలిపారు.

కాలనీవాసులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే రంగారెడ్డితో శివాజీనగర్ కాలనీవాసులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని సర్వే నంబర్ 240, 241, 242లోని శివాజీనగర్ కాలనీ వాసులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి భరోసానిచ్చారు. మాజీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేను తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. గడిచిన ఏడు నెలలుగా కాలనీలో సెక్షన్ 164 అమలులో ఉండటంతో నిర్మాణాలు చేపట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. గ్రామాల్లో ఉన్న పొలాలను అమ్ముకుని, అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. తక్షణమే సెక్షన్‌ను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. తాను ఎప్పుడు పేదల పక్షమేనని, భూ కబ్జాదారులను అడ్డుకుంటామని ప్లాట్ల యజమానులకు ధైర్యం ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ అనంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతూ.. వెంటనే సెక్షన్ 164 ఎత్తివేయాలని, పోలీస్ శాఖతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు హనుమాన్ దీక్షితులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధారాణి

యాచారం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ రాధారాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీటి ఇబ్బందులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతం, కూలీలకు ఉపాధి పనులు కల్పించడం, మొక్కలు నాటడం, డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయడం వంటి పనుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అలుగు సమస్యకు పరిష్కారం చూపుతాం



కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని అపిల్ అవెన్యూ కాలనీలో మాసబ్ చెరువు అలుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం అధికారుల బృందం కాలనీలోని కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందుగా కాలువపైన ఉన్న సీసీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. దాన్ని తొలగించి నీరు సులువుగా ప్రవహించేలా చేస్తామని పేర్కొన్నారు. ఆ తరువాత అంచనాలను రూపొందించి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు అభివృద్ధికి సమష్టి కృషి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



బీజేపీ నేత ఆచారిని సత్కరిస్తున్న దసరా ఉత్సవ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సమష్టిగా కృషి చేద్దామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సూచించారు. ఆమనగల్లు అభివృద్ధి కోసం ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డిలను కలుద్దామని చెప్పారు. పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో మంగళవారం దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా సంబరాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, దాతలు, అధికారులను సత్కరించారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ.. ఆమనగల్లు అభివృద్ధిని ఎవరూ అడ్డుకోవడం లేదన్నారు. పట్టణాభివృద్ధి కోసం రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అందరం కలిసి ముందుకు సాగుదామన్నారు. అభివృద్ధి కోసం అవసరమైతే తాను కూడా ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డిలను కలిసి అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుందామని చెప్పారు. వీలైనంత త్వరలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వివాదం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగేలా చూడాలని సూచించారు. ఆమనగల్లు అభివృద్ధికి ఎవరు అడ్డుపడిన సహించేది లేదని హెచ్చరించారు. త్వరలో బొడ్రాయి పండుగ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కేశవులు, గిరియాదవ్, దుర్గయ్య, పత్యానాయక్, నిరంజన్‌గౌడ్, లక్ష్మణ్, నర్సింహ, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, రాము, మండ్లి రాములు, శ్రీను, మల్లయ్య, మానయ్య, సాయిలు, భాస్కర్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోండి

మంచాల: మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో జెండా దేవుడు ఆలయ ప్రాంగణంలో చెట్లు నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ గిరిజన సంఘం నాయకుడు లింగం నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇరవై ఏళ్లుగా ఆలయ ప్రాంగణంలో చెట్లు పెంచుతున్నారని చెప్పారు. ఎలాంటి సమాచారం లేకుండా అక్రమంగా చెట్లు నరికి వేశారన్నారు. ఈ విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు.